తెలంగాణపై వివక్షకు బడ్జెట్ కేటాయింపులే ఉదాహరణ

కొలన్ హన్మంత్‌రెడ్డి


ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

నిజాంపేట్ : కేంద్రం తెలంగాణపై ఎంత వివక్ష చూపుతుందో బడ్జెట్ కేటాయింపులే ఉదాహరణ అని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. బడ్జెట్‌లో తెలంగాణకు చేసిన అన్యాయంపై టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ ఆదేశాల మేరకు సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నిజాంపేట్ మున్సిపల్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కార్పొరేషన్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కొలన్ హన్మంత్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణపై ఉన్న వివక్ష స్పష్టంగా కనిపిస్తుందన్నారు. తెలంగాణకు కేంద్రం నిధులు కేటాయించడంలో తీవ్ర నిర్లక్ష్యం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రం నుంచి గెలిచిన 8 మంది బీజేపీ ఎంపీలు తెలంగాణకు ఒక్క రూపాయి కూడా తేకపోవడం సిగ్గుచేటమన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సర్సారెడ్డి భూపతి రెడ్డి, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ బొంగునూరి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మీ, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు సదానందం, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ యువజన నాయకులు బొంగునూరి కిశోర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్షత్రియ కులస్తులకు అండగా ఉంటాం


చెక్కులను అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

కుత్బుల్లాపూర్: క్షత్రియ కులస్తులకు అండగా ఉంటామని, నిరుపేదలకు విద్య, వైద్యం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని క్షత్రియ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు పాత్తూరి శివాజీ రాజు అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కొంపల్లిలోని ఎన్సీఎల్ నార్త్ కాలనీలో ఆర్థిక సహాయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జయభేరి కాలనీకి చెందిన పి.నమృత దేవికి పదో తరగతిలో 10/10 జీపీఏ రావడంతో రూ.10 వేలు, ఇంజినీరింగ్‌లో ప్రతిభ కనబర్చిన పెనుమత్స సూర్య అఖిల్ వర్మకు రూ.20 వేలు అందించారు. అలాగే కొంపల్లి ఉమామహేశ్వర్ కాలనీకి చెందిన ఒంటరి మహిళ నాగదేవి ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇద్దరు పిల్లల చదువులకు ఇబ్బంది పడుతున్నందున వారి పిల్లల చదువు నిమిత్తం రూ.10 వేలు, అదే కాలనీకి చెందిన దివ్యాంగురాలు కూనపరాజు వెంకటలక్ష్మికి ప్రతీ నెల రూ.వెయ్యి రూపాయల పింఛన్‌ను ప్రారంభించి లబ్దిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా శివాజీ రాజు మాట్లాడుతూ దాతల సాయంతో రానున్న రోజుల్లో అర్హులైన పేదలకు విద్య, వైద్యం విషయంలో సహాయం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాని, ఉపాధ్యక్షుడు చిరంజీవి రాజు, కోశాధికారి భానుకుమార్, సభ్యులు సుధీర్, చైతన్య వర్మ, బంగారు రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

చింతల్: కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ కార్యాలయ ఆవరణలో కొలువుదీరిన కనకదుర్గమ్మ తల్లి దేవాలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 6 గంటలకు సామూహిక కుంకుమార్చన నిర్వహించి 7:30 గంటలకు దుర్గాదేవి హోమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ అశోక్, అధికారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయాలు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ కార్యాలయ సిబ్బంది, కాంట్రాక్టర్లు ఏపీహెచ్‌బీ కాలనీ ప్రజలు అమ్మవారికి మొక్కలు చెల్లించి తీర్థప్రసాదాలను స్వీకరించారు.


పూజలు నిర్వహిస్తున్న అశోక్ తదితరులు

వాళ్లు కట్టడం... వీరు కూల్చడం..!


నిర్మాణాన్ని కూల్చివేస్తున్న రెవెన్యూ సిబ్బంది

సుభాష్‌నగర్: వారంరోజులుగా ప్రభుత్వ స్థలాల్లో వెలిసిన నిర్మాణాలను కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులు ఓవైపు కూల్చుతుంటే, మరోవైపు కబ్జాదారులు మాత్రం అధికారుల కళ్లుగప్పి నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ క్రమంలో గాజులరామారం సర్వే నెంబర్ 307, 342 ప్రభుత్వ స్థలంలో వెలిసిన రెండు గదులను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గులాం కలీం నేతృత్వంలో సోమవారం కూల్చివేశారు. అయితే ఆదివారం సెలవుదినం కావడంతో గుట్టుచప్పుడు కాకుండా ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపట్టారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ ఇన్‌సెక్టర్ మళ్లీ వాటిని తొలగించారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

కుత్బుల్లాపూర్: చింతల్‌గణేష్ నగర్‌లోని అమృతాలయ దశమ వార్షిక బ్రహ్మోత్సవాల గోడ పత్రికలను ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ బొడ్డు వెంకటేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు నరసింహారెడ్డి, లింగం, భాస్కర్‌గౌడ్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గాజులరామారం డివిజన్ మెట్కానిగూడ రాజీవ్‌గాంధీ నగర్‌లోని శ్రీ మల్లికార్జున స్వామి జాతర మహోత్సవ ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు ఆలయ కమిటీ సభ్యులు అందజేసి ఆహ్వానించారు. జీడిమెట్ల డివిజన్‌లోని సెయింట్ మోసెస్ హైస్కూల్ వేదికగా కుత్బుల్లాపూర్ మండలం స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లిటరరీ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ – 2025 ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, సీనియర్ వెటరన్ అథ్లెట్ మర్రి లక్ష్మారెడ్డిలు హాజరై స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించారు.


బ్రహ్మోత్సవాల గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్


పూజలు చేస్తున్న పండితులు


హాజరైన భక్తులు

కనుల పండువగా తిరు కల్యాణ మహోత్సవం

- స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు
- పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట కొండపై ఉన్న లక్ష్మీ వేంకటేశ్వర స్వామి 54వ బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం తిరు కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించగా భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ఉదయం అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రముఖుల హాజరు...

ఈ కల్యాణ మహోత్సవానికి స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానందగౌడ్, కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూపతి రెడ్డి, కార్పొరేటర్లు జగన్, రావుల శేషగిరి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బొమ్మక్ అజయ్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ జెకె శేఖర్ యాదవ్, మల్లారెడ్డి తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.


కల్యాణ మండపంలో స్వామివారు


మహోత్సవంలో కేపీ వివేకానంద గౌడ్

కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం..

ఇటు దుకాణాలతో, అటు పిల్లలు ఆడుకోవడానికి జాయింట్ వీల్‌తో పాటు తదితర ఆట వస్తువులు ఏర్పాటు చేయడంతో ఆలయ ప్రాంగణం 2 రోజుల నుంచి కిక్కిరిసి పోయింది. చిన్నపెద్ద తేడాలేకుండా అందరు వచ్చి స్వామివారి దర్శనం చేసుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆట పరికరాలతో ఆడుతూ ఆనందంలో మునిగారు.

పకడ్బందీగా ఏర్పాట్లు.....

కొండపై వచ్చే భక్తులకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లను ఆలయ ఈఓ, కమిటీ సభ్యులు ముమ్మర ఏర్పాటు చేశారు. ఎటువంటి గొడవలు తలెత్తకుండా పటిష్ట పోలీస్ బందోబస్తీ కూడా ఏర్పాటు చేశారు.


స్వామి దర్శనం కోసం క్యూలైన్‌లోని భక్తులు

నేడు స్వామివారి పల్లకీ సేవ, గ్రామోత్సవం

బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం స్వామివారి పల్లకీ సేవ, గ్రామోత్సవం కార్యక్రమాలు ఉంటాయని ఆలయ ఈఓ, కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానున్నట్లు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు తెలిపారు.

డంపింగ్ కేంద్రంలో అగ్ని ప్రమాదం

రంగారెడ్డినగర్: ఓ డంపింగ్ గోదాంలో ఆదివారం రాత్రి స్వల్ప అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. రంగారెడ్డి నగర్ డివిజన్ చెన్నారెడ్డి నగర్‌లో ఓ గుర్తు తెలియని పరిశ్రమకు చెందిన డంపింగ్ కేంద్రం ఉంది. ఇందులో కెమికల్ పరిశ్రమకు చెందిన రసాయనిక డ్రమ్ములతో పాటు పలు అట్టల ఫ్యాక్టరీకి సంబంధించిన మెటీరియల్ కూడా నిల్వ చేస్తున్నారు. ఆదివారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించి సుమారు నాలుగు లక్షల మేర అట్టల ఫ్యాక్టరీకి చెందిన పేపర్ ముడిసరుకు కాలి బూడిదైంది. విషయం తెలుసుకున్న జీడిమెట్ల ఫైర్ సిబ్బంది సకాలంలో అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు.

ఘనంగా ఇన్‌కాయిస్ 26వ వార్షికోత్సవం

నిజాంపేట్: ఇన్‌కాయిస్ (ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్), మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్, భారత ప్రభుత్వం వారి ఆధ్వర్యంలో సోమవారం 26వ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా డైరెక్టర్ జనరల్ సీఎస్ఐఆర్, సెక్రటరీ డీఎస్ఐఆర్ డాక్టర్ కలైసెల్వీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎస్ఐఆర్ ఎన్ఐఓ ల్యాబ్, ఎమ్ఓఈఎస్ ఆధ్వర్యంలో ఇన్‌కాయిస్ సామాన్యుల ప్రయోజనం కోసం పనిచేయాలని కోరారు. అనంతరం స్పేస్ కమిషన్ మాజీ చైర్మన్ డా.కె. రాధాక్రిష్ణన్, ఎన్ఐఏఎస్ డైరెక్టర్ డా. శైలేష్ నాయక్‌లు మాట్లాడుతూ ఇన్‌కాయిస్‌ను 1999లో ఫిబ్రవరి 3న ఎందుకు ప్రారంభించాల్సిన అవసరం వచ్చింది.. దీని ఉద్దేశం ఏమిటి అనే విషయాలపై మాట్లాడారు. ఇన్‌కాయిస్ మాజీ డైరెక్టర్లు డా. ఎస్ఎస్‌సీ షెనోయ్, డాక్టర్. టి.శ్రీనివాస్‌లు సైతం ఇన్‌కాయిస్‌తో తమ ప్రయాణాన్ని పంచుకున్నారు.

కార్మికుల శ్రేయస్సుకు కృషి

కుత్బుల్లాపూర్: కార్మికుల హక్కుల కోసం తాను నిరంతరం శ్రమిస్తానని, వారి న్యాయమైన డిమాండ్ల కోసం పోరాటం చేస్తానని కార్మికనేత ముద్దాపురం మదన్‌గౌడ్ అన్నారు. జీడిమెట్ల పారిశ్రామికవాడలోని శ్రీనిధి సెక్యూరిటీ ప్రింటింగ్ పరిశ్రమలో యాజమాన్యంతో మాట్లాడి కార్మికులకు ఒప్పందం కుదిర్చారు. ఈ సందర్భంగా సోమవారం పరిశ్రమ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్మికులు ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం మదన్‌గౌడ్ మాట్లాడుతూ ఈ పరిశ్రమలో ఇప్పటి వరకు వరుసగా 5 అగ్రిమెంట్లు చేసుకోవడం జరిగిందని, ఇటీవల జరిగిన వేతన ఒప్పందంలో ప్రతి నెల రూ.9వేలు అదనంగా నేరుగా కార్మికులకు అందుతుందని, దీని ద్వారా ప్రతి కార్మికుడు నెలకు రూ.40 వేలు వేతనం పొందుతున్నారన్నారు. బీద కార్మికులకు క్యాంటీన్ సౌకర్యం కూడా కల్పించామన్నారు. కార్మికులు ఐక్యంగా ఉండి తమ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంటీ కార్మికుడు వెంకన్న, మాజీ జెట్పీటీసీ మల్లేష్‌గౌడ్, లీ ఫార్మా జనరల్ సెక్రెటరీ అశోక్, బయో కెమికల్ జనరల్ సెక్రెటరీ మోహన్, తెలంగాణ ఉద్యమ నాయకుడు రమేష్, యువ నాయకులు శివగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్లు సుభాష్, సహదేవ్, జనరల్ సెక్రెటరీ అంబదాస్, వైస్ ప్రెసిడెంట్ యోగేష్, ట్రెజరర్ మల్లేష్, కార్మికులు పాల్గొన్నారు.


మదన్‌గౌడ్‌ను గజమాలతో సత్కరిస్తున్న కార్మికులు

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

కమిషనర్ అవినాష్ మహంతి

కుత్బుల్లాపూర్: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని పేట్ బషీరాబాద్ కొత్త ఏసీపీ కార్యాలయాన్ని సోమవారం కమిషనర్ అవినాష్ మహంతి ప్రారంభించారు. అనంతరం పేట్ బషీరాబాద్ పియస్ పరిధిలోని 127 సీసీ టీవీ కెమెరాలను, మేడ్చల్ డీసీపీ కాన్ఫరెన్స్ హాల్‌ను కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలను అందించే దిశగా పనిచేయాలని కోరారు. ఈ కార్యకమంలో డీసీపీ–మేడ్చల్ కోటిరెడ్డి , అడిషనల్ డీసీపీ పురుషోత్తమ్, పేట్ బషీరాబాద్ ఏసీపీ రాములు మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్ రెడ్డి, సీఐ విజయవర్ధన్, ఎస్ఐలు పాల్గొన్నారు.


అవినాష్ మహంతికి స్వాగతం పలుకుతున్న పేట్ బషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ విజయవర్ధన్

మహా ప్రదర్శనతో ప్రభుత్వం దిగి రావాలి

దుండిగల్: ఎస్సీ వర్గీకరణతోనే మాదిగ, మాదిగ ఉపకులాలకు న్యాయం జరుగుతుందని దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో ఈనెల 7న ఎల్బీ స్టేడియంలో చేపట్టే 'లక్ష డప్పులు, వేల గొంతుక'ల వాల్‌పోస్టర్‌ను సోమవారం దుండిగల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటం అనంతరం సుప్రీంకోర్టు ఇచ్చిన గ్రీన్ సిగ్నల్‌ను కొంతమంది వర్గీకరణ వ్యతిరేక శక్తులు అడ్డుకుంటున్నారని, ఈ కుట్రలను తిప్పికొట్టేందుకు ఈనెల 7న నగరంలో జరిగే మహా ప్రదర్శనకు ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహాజన వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర కోకన్వీనర్ డప్పు రామస్వామి, ఎంజెఎఫ్ నాయకులు ముక్కర్ల లాలయ్య మాదిగ, డప్పు కళాకారుల సంఘం అధ్యక్షులు మేకల నరసింహ, మహిళా ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్ అంజలి, మేడ్చల్ జిల్లా ఎంజెఎఫ్. కన్వీనర్ జోగు వెంకట్ మాదిగ పాల్గొన్నారు.

ల్యాబ్‌టెక్నీషియన్ల నూతన కమిటీ ఎన్నిక

సుభాష్‌నగర్: పారామెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ మేడ్చల్ జిల్లా నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు వీరయ్య, ఉపాధ్యక్షుడు నాగరాజు అధ్యక్షతన సూరారంలో జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా అంజన్‌బాబు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సురేష్, ఉపాధ్యక్షుడిగా ఓరుగంటి రాజు, ప్రధాన కార్యదర్శిగా కర్నాటి మహేష్, ఉమ్మడి ప్రధాన కార్యదర్శిగా స్వామిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అంజన్‌బాబు మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్ల ఐక్యత, సంక్షేమం కోసం నా వంతు కృషి చేస్తానన్నారు. వీరయ్య మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్‌లపై జరుగుతున్న వివక్షతపై ప్రతి ఒక్కరూ ఐక్యంగా పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కిన్నెర రవీందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దార్ల అజయ్, హైదరాబాద్ జనరల్ సెక్రెటరీ తగరం సైదులు తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక రంగం దినదినాభివృద్ధి

జీడిమెట్ల: తెలంగాణలో పారిశ్రామికరంగం దినదినాభివృద్ధి చెందుతుందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బీజేపీ ఇన్‌చార్జి ఎస్.మల్లారెడ్డి అన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో వాయువ్య రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు స్టడీటూర్‌లో భాగంగా సోమవారం జీడిమెట్ల, గండిమైసమ్మలోని పలు పరిశ్రమల్లో పర్యటించారు. ఈ సందర్భంగా జీడిమెట్లలోని ఇండస్ట్రీయల్ కార్యాలయంలో విద్యార్థులకు సమావేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పరిశ్రమలు వాటి పనితీరుపై విద్యార్థులు మల్లారెడ్డితో చర్చించారు. అనంతరం విద్యార్థులు స్టడీటూర్‌లో నేర్చుకున్న అంశాలను ఒక్కొక్కరు వివరించారు.


మల్లారెడ్డితో విద్యార్థులు

ఘనంగా వసంత పంచమి వేడుకలు

వసంత పంచమిని పురస్కరించుకుని సోమవారం అమ్మవార్ల ఆలయాలు, విద్యాలయాల్లో అక్షరాభ్యాసాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో సరస్వతి దేవి చిత్రపటాలను ఏర్పాటు చేసి పూజలు చేశారు.
–కుత్బుల్లాపూర్


సూరారం నార్త్‌సిటీ హైస్కూల్‌లో...


చింతల్ బీపీఎస్ ఒలింపియాడ్ స్కూల్‌లో...


జీడిమెట్ల లిటిల్ లిల్లీ హైస్కూల్‌లో...


సుభాష్‌నగర్ బోధివృక్షా స్కూల్‌లో...


జగద్గిరిగుట్ట సంస్కృతి స్కూల్‌లో...

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్ : 33/11 బౌరంపేట సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈహెచ్‌టీ బొల్లారం నుంచి 33కేవీ సత్యం ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, 11 కేవీ కోకాకోలా ఫీడర్‌లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు, 11 కేవీ జున్రమ్ ఫీడర్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని ఏఈ ఎల్.చలపతిరావు కోరారు.

ప్రజావాణికి స్పందన కరువు

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో నిర్వహించిన ప్రజావాణికి స్పందన కరువైంది. సోమవారం ఉదయం 10: 30 నుంచి మధ్యాహ్నం 1:00 వరకు నిర్వహించిన ప్రజావాణిలో కేవలం 4 ఫిర్యాదులు మాత్రమే రావడం విశేషం. కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ నరసింహ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మూడు ఫిర్యాదులు రాగా 2 ఎలక్ట్రికల్, 1 టౌన్ ప్లానింగ్, గాజులరామారం సర్కిల్ ఉప కమిషనర్ మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రజావాణిలో ఒక ఫిర్యాదు ఇంజినీరింగ్ విభాగంపై రావడం విశేషం. ఏదో ఒక మొక్కుబడిగా ప్రజావాణి నిర్వహించి వచ్చిన ఫిర్యాదులను తీసుకుంటున్నారని, ఇచ్చిన ఫిర్యాదుల విషయంలో అసలు అధికారులు సమస్యను పరిష్కరిస్తున్న దాఖలాలు లేవని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రతివారం అన్ని విభాగాల అధికారులు పాల్గొనాలని ఉన్నత అధికారులు పక్క ఆదేశాలు జారీ చేస్తున్న ప్రజావాణి కిందిస్థాయి సిబ్బందితో మమ అనిపిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా వచ్చిన ఫిర్యాదుల విషయంపై సీరియస్‌గా అధికారులు వ్యవహరిస్తే తప్పకుండా భవిష్యత్తులో జరిగే ప్రజావాణి కార్యక్రమాలకు స్పందన వస్తుందని పేర్కొనడం గమనార్హం.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం


నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

జీడిమెట్ల: పేదలను విస్మరించి కార్పొరేట్లకు కడుపు నింపేలా కేంద్ర బడ్జెట్ ఉందని సీపీఎం నాయకులు కీలుకాని లక్ష్మణ్ అన్నారు. కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా సోమవారం షాపూర్‌నగర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ తెలంగాణలో ప్రజలు బీజేపీకి 8 సీట్లు కట్టబెడితే ఎంపీలు కనీసం నోరు విప్పడం లేదన్నారు. కేంద్రం తెలంగాణ పట్ల వివక్ష చూసి బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం చేసిందని వారు ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉన్నన్ని రోజులు తెలంగాణకు అన్యాయం జరుగుతుందని వారు అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఎం నాయకులు పసుల అంజయ్య, దేవదానం, కె.శ్రీను, మల్లారెడ్డి, వీరేషు, సాధులు, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల గోదావరి హోమ్స్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నామని ఆలయ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. సా.5.30 గంటల నుంచి 21సార్లు సామూహిక ' ఆదిత్య హృదయ స్తోత్ర పారాయణం, శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారిని సూర్యప్రభ వాహనంపై ఆలయ మాడవీధుల్లో ఏడుసార్లు భాజాభజంత్రీల మధ్య ఊరేగిస్తామన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ ఉంటుందని, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ కోరింది.


ఆలయంలో కొలువైన శ్రీదేవి భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి

తహసీల్దార్ కార్యాలయానికి దరఖాస్తుదారుల తాకిడి


నోటీసులు అతికిస్తున్న సిబ్బంది

సుభాష్‌నగర్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల స్వీకరణ సోమవారం గాజులరామారం, కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్లలోని వార్డు కార్యాలయాల్లో నిర్వహించారు. అయితే ఎనిమిది డివిజన్ల నుంచి తహసీల్దార్ కార్యాలయానికి భారీగా తరలివచ్చారు. అక్కడున్న సిబ్బంది వార్డు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పంపించగా, పెద్ద సంఖ్యలో దరఖాస్తుదారులు రావడంతో సిబ్బంది తలలు పట్టుకున్నారు. చివరకు మీ స్థానికంగా ఉన్న వార్డు కార్యాలయాల్లోనే దరఖాస్తు చేసుకోవాలని కార్యాలయ ఆవరణలో నోటీసులు అతికించడంతో వచ్చినవారు వెనుతిరిగారు.